# సదాశయం

## మధురాంతకం రాజారాం

రైల్లో దూర ప్రయాణాలు చేసిన వారు లెక్కలేనన్ని స్టేషన్లు చూచివుంటారు. మల్లవరం జంక్షన్‌లో నిలిచిపోయే పెద్ద స్టేషనుగాదు. నాకైనా అది జ్ఞాపకం వున్నదంటే అందుకు కారణం నేనక్కడ కొద్ది రోజులపాటు ఉద్యోగం చేసివుండడమే. అప్పటికింకా నాకు ఉద్యోగం ఖాయం కాలేదు. ఎక్కడ వేకన్సీ పడితే అక్కడికి నన్ను రవాణా చేస్తున్నారు. మల్లవరం వాటరింగు స్టేషను. ఆరుగురు పంపు డ్రయివర్లలో ఒకతను నెల రోజులు సిక్ లీవు పెట్టాడు. ఆ ఖాళీలోకి నన్ను ఉరికించింది డిపార్టుమెంటు. వెళ్ళి స్టేషనులో చేరాను. అంతకు మునుపు నేను రైల్లో వెళుతూ మల్లవరంవైపు చూడకపోలేదు. కానీ అక్కడ కొంతకాలంపాటు నివసించవలసి వుంటుందన్న దృష్టితో మల్లవరాన్ని చూడడం అదే ప్రథమం. సాధారణంగా మొదట ఊరు ఏర్పడి, తర్వాత స్టేషను సహజపరిణామం. అందుకు విరుద్ధంగా మల్లవరంలో మొదట స్టేషనే సెలక్టు చేయబడి ఊరు తర్వాత ఏర్పడినట్టుగా తోచింది నాకు; నా ఊహ సత్యదూరం గావచ్చు. కానీ నేనిలా అనుకోడానికి కారణం మాత్రం లేకపోలేదు. రైలు రోడ్డు ఆ ఊరి నట్ట నడుమ పరుగిడుతోంది. ఉన్న యిండ్లు వీధులుగా, వరుసలుగా గాకుండా గుంపులు గుంపులుగా కష్టపడివున్నాయి. ఒక్కొక్క గుంపునూ ఒక్కొక్క వాడగా పేర్కొంటే వాడకూ వాడకూ మధ్య ఎడం వుండడమే గాదు. ఆ వాడలన్నీ స్టేషనుకొక ఫర్లాంగు దూరంలోనే వున్నాయి. స్టేషను చుట్టూరా వున్నది పచ్చిక మైదానం. ఆ మైదానంలో అక్కడక్కడా ఈత, కామక, వేప అలాంటివే మరికొన్ని చిన్న చెట్లు కానవస్తున్నాయి. స్టేషను ఆవరణను బాహ్య ప్రపంచంనుంచి దాచిపెడుతున్నట్టుగా ప్లాట్‌ఫారానికి అంచుగా నిలబడివున్న నేరేడు, మద్దిచెట్లు మాత్రం నిటారుగా పెరిగి, గుబురుగా విస్తరించి ఉన్నాయి. ఐనా ఆ పరిసరాలను సర్వే చేస్తూ కాలహరణం చేయడం నా కర్తవ్యంగాదు. కర్తవ్యం గుర్తుకు రాగానే నేను స్టేషను మాస్టరుగారిని దర్శించాను. ఆర్డరు కాగితం చూపించాను. "ఓహో, వెంకటరత్నం నువ్వేనా? మాకు ఈ రోజు ఉదయమే కాగితం మందిందిలే. రిజిష్టరులో జాయినింగు టైము వ్రాసుకుంటామగానీ, నువ్వు వెళ్ళి దావూద్‌ఖానెక్కడున్నాడో చూడు. నీ డ్యూటీ ఎప్పుడో, ఏమిటో అతడే చెప్పాలి" అన్నారు స్టేషన్ మాస్టరుగారు.

"దావూద్‌ఖానంటే ఎవరండీ" అన్నాను.

"ఊఁహూ! దావూద్‌ఖానంటే ఎవరో తెలియదా ఇంకా! తెలుస్తుందిలే; వాకబు చేయాలి మరి! వివరాలన్నీ తెలియజెప్పడానికి ఇన్ఫర్‌మేషన్ సెంటరుగాదు. రైల్వే స్టేషను...."

క్రింది ఉద్యోగులపట్ల ఎంత కటువుగా ప్రవర్తిస్తే అంతగా తమ ఉద్యోగ హోదా పెరిగినట్టు భావిస్తారు కొందరు ఉన్నతోద్యోగులు, స్టేషన్‌మాస్టరుగారి నైజం గూడా అలాంటిదేనని తేటతెల్లమైంది.

సూర్యాస్తమానం గావడానికింకా రెండు గడియల వ్యవధి ఉంది. చెట్లనీడలు పొడుగ్గా పచ్చిక మైదానంలోకి వ్యాపించి ఉన్నాయి. ఆ నీడల్లో గంభీరంగా నిలచి ఉన్న వాటర్ టాంకు దృగ్గోచరమైంది. దాని కల్లంత దూరంలో సముద్రంలాంటి పెద్ద బావి. దాని దాపున పంపు డ్రయివర్లు తల దాచుకోడానికి డబ్బారేకుల షెడ్డు ఒకటి. వాటరు టాంకు దగ్గర చెప్పరానంత సందడిగా ఉంది. పది పదిహేనుగురు ఆడవాళ్ళు బిందెలూ, బకెట్లూ పుచ్చుకుని పంపుచుట్టూ బడిగాపులు పడుతున్నారు. కావడి కొయ్యలకు కడవలు తగిలించుకున్న మగవాళ్ళు కొందరు ఆడవాళ్ళను దూరంగా వైదొలగమని కారుబారు చేస్తున్నారు. నీటితో నిండిన బిందెలు గ్రామాభిముఖంగా వెళ్ళిపోతున్నాయి. మొదటి చూపులో మల్లవరం నాకెలా ప్రత్యక్షమైందో యిందాక చెప్పాను. వాటర్‌టాంకు దగ్గరికి వెళ్ళి నిల్చున్న తర్వాత దాని స్వరూపం మరింత స్పష్టంగా వెల్లడైంది. మల్లవరం ఒక పువ్వులాంటిదైతే వాటర్‌టాంకు ఆ పువ్వులో కాడలాంటిది. ఒక్కొక్క వాడనుంచీ వాటర్‌టాంకుకు పచ్చిక మైదానంగుండా కాలిబాట ఏర్పడి ఉంది. ప్రతి రెండు కాలిబాటల మధ్యప్రదేశాన్నీ ఒక రేకుగా భావించుకుంటే అలాంటి రేకులు ఏడెనిమిది వున్నాయి. కానీ మల్లవరం పువ్వులా వున్నా, పండులావున్నా నా కొరిగేదేమీలేదు. అప్పట్లో నా బుద్ధిని తొలిచి వేయసాగిన ధర్మసందేహం ఒక్కటే: బావిలో దండిగా నీళ్లున్న మాట నిజమే; కానీ ఆ నీళ్ళు అయిదారుమట్ల లోతులో ఉన్నాయి. నీటిమట్టంనుంచీ వాటర్ టాంకుకు ఎంత లేదన్నా యాభై గజాల ఎత్తుంటుంది. ఆరుగురు మనుషులు ఉదయం సాయంకాలం రెండువేళలా ఒక్కొక్క జాముపాటు చక్రాలు త్రిప్పితేగానీ క్రింది నీళ్ళు పైకి వెళ్ళవు. ఈ పనికోసం డిపార్టుమెంటు నెల ఒకటికి కొన్ని వందల రూపాయలు ఖర్చు పెడుతోంది. ఎందుకని? నీళ్ళు లేకపోతే యింజన్లు కదలవు. ఇంజన్లు కదలకపోతే రైళ్ళు నడవవు. కానీ మల్లవరం పౌరులకు ఈ విషయం తెలిసినట్టులేదు. వాళ్ళు రైల్వే డిపార్టుమెంటుకు చెందిన వాటర్ టాంకును తమ స్వంత ఆస్తిగా తలపోస్తున్నారు.

వాటర్‌టాంకు రైల్వే డిపార్టుమెంటువారి సొంత సొత్తని నాకు నికరంగా తెలుసు. కానీ నోరు తెరిచి ఆ మాట చెప్పడానికి నాకున్న అవకాశాలు చాలా తక్కువ. అందువల్ల పంపుదగ్గర చెలరేగుతున్న అలజడితో అట్టె ప్రమేయం పెట్టుకోకుండా వెళ్ళి షెడ్డుక్రింద నిల్చున్నాను.

క్షణక్షణానికి బిందెల సంరంభం శృతిమించి రాగాన పడుతోంది. లోకంలో పోటీకి తావున్న ప్రతిచోటా నోరున్నవాడిదే గెలుపు. బలంవున్నవాడిదే బ్రతుకు. కావడి కొయ్యతో ఒక ఆసామి ఆడవాళ్లను

వెనక్కు నెట్టడానికి ప్రయత్నించడంతో ఓ పన్నెండేళ్ళ అమ్మాయి వెళ్ళి ఓ ముసలావిడపైన పడింది. ఆ ముసలావిడ నభేలున నేలకొరిగింది. నలుగురైదుగురు ఆడవాళ్ళు ఆ ముసలావిడకు బాసటగా నిలిచారు. పోరు ప్రారంభమైంది. చీర కొంగులు నడుముకు చుట్టుకున్న ఆడవాళ్ళు కావడికి కొయ్యకు భయపడి వెనుకాడే రకంగాదు. ఆ మగవాడుకూడా ఆడవాళ్ళతో యుద్ధానికి తలపడడంతో వున్న నామోషీ తనన్ని గుర్తించేవాడుకాదు. అతడు పంపు చుట్టూ తన కావడి కొయ్యను బాణాకర్రలా త్రిప్పుతూ శివాలు త్రొక్కడం ప్రారంభించాడు. ఏక్కడి బిందెలనక్కడే దిగవిడిచి స్త్రీలందరూ వెనక్కు తప్పుకుంటూ అడుగులు పెట్టసాగారు. ఆర్తత్రాణ పరాయణ దేవదైనాసరే అతడు రంగంలో దూకడానికి అదే తగిన అదను. అదే జరిగిందిగదా! వచ్చినవాడు ఆరడుగులవ్యక్తి. ఉక్కు కడ్డీలాంటి దేహం. గుండుతల. బవిరిగడ్డం. నడుముకు లుంగి చుట్టుకున్నాడు. పైన చేతుల్లేని బనీను తొడుక్కున్నాడు. చేతిలో ఒక దారం. దానికి అటువైపున కట్టివుంచిన ఒక మేకపోతు. చంకలో లాఠీ కర్రలాంటి కొయ్యముక్క. నాకొకరు చెప్పగా తెలిసిన విషయంగాదు. అంతర్వాణి ప్రబోధంలాంటి సంగతి. బహుశా యితడే దావూద్ ఖాన్ అయివుండాలి! సందేహమెందుకు! అతడే నయ్యా దావూద్ ఖాను!

"హేష్టీ భాయీ యిక్డాగోడ్వా! ఒరే బచ్చే గంగారాజూ! నీ కావడీ కొయ్య విరిచి పొయ్యిలో పెట్టేసేను. సూస్కో తడాకా! ఎవరి మానానావాళ్ళు నీళ్ళు పట్టుకెళ్ళాలి-యిక్డా! జబర్దస్తీచేస్తే ఊర్కునేది లేదు. తెల్సిందీగదూ! ఒక్కరూ ఒక్కరూగా తీసుకెళ్ళండి...."

దావూద్ ఖాను చెప్పింది మంత్రంగాదు. మాటలే! కానీ ఆమాటలు మంత్రంలా పని చేశాయి. వాకట్టు కట్టినట్టుగా అక్కడి జనంలో మాటలుడిగిపోయాయి. బిందెలు సైతం చప్పుడు చేయడం మానుకున్నాయి. ఇప్పుడు వినిపిస్తున్నది పంపులోనుంచీ ధారాపాతంగా దూకుతున్న నీళ్ళచప్పుడు ఒక్కటే!—

నాకొక క్రొత్తవిషయం అవగతమైంది. దేశకాలపరిస్థితులనుబట్టి కొన్ని సత్యాలు పూర్తిగా మారిపోతుంటాయి. ఈ దృక్పథంలోనుంచీ చూస్తే ఈ వాటర్ ట్యాంకు రైల్వే డిపార్టుమెంటుదీగాదు - మల్లవరం పౌరులదీగాదు. ఇది దావూద్ ఖానుది!

దావూద్ ఖాన్ షెడ్ లోపలికివచ్చి కుక్కి మంచంలో కూలబడ్డాడు. మేకపోతును మంచం కోడుకే కట్టిపెట్టాడు. బీడీ ముట్టించుకోబోతూ నావైపుచూచి "హరే, హెవరు భాయీ యివ్వు! హెప్పుడూసూసిన ముఖం కాదే! హే ఊరు మీది?" అనిపలకరించాడు.

చెప్పుకున్నాను. నాపేరు వెంకటరత్నం. ఊరు రంగసముద్రం. వయస్సు యిరవై నాలుగు. సర్వీసులోచేరి రెండేళ్లయింది.




మధురాంతకం రాజారాం

ప్రస్తుతం చేస్తున్నది టెంపరరీ ఉద్యోగమే. నెలనాళ్ళ ఖాళీలో నన్నిక్కడ పంపుడ్రయివరుగా వేయడం జరిగింది....

"హచ్చా, హచ్చా" అన్నాడు దావూద్ కాను. అతడా మాటల్ని తనసామ్రాజ్యంలో ఒక కొత్తవ్యక్తికి పౌరసత్వం యివ్వడానికి ఒప్పుకున్న రాజాధిరాజులా అన్నాడు.

కీయిచ్చి వదిలిపెడితే గడియారం పని చేయడం మొదలుపెడుతుంది. మాట్లాడడంలో గడియారంలాంటివాడు దావూద్ కాను. కానీ అతడి భాషను యధాతథంగా ఉదహరించడం అలవిమాలినపని. ఆ భాషలో అచ్చులులేవు. అచ్చులన్నీ హకారాలుగా వికారం చెందడం అందులోని వైచిత్రి. భాషకన్నా భావమే గొప్పదిగనుక నేనతడి మాటల్ని యధాతథంగా ఉటికించే దుస్సాహసానికి పూనుకోవడంలేదు. [పాఠకులు మన్నించగలరు].

మల్లవరం స్టేషనులో ఆరుగురు పంపుడ్రయివర్లున్నారన్నానుగదూ! ఆ ఆరుగురిలోనూ దావూద్ కాను సీనియరు పంపుడ్రయివరట! అదీ ఉద్యోగరీత్యా అతడి హోదా! కానీ అతడి ఉద్యోగానికి, స్థానికంగా అతడికున్న పలుకుపడికీ బొత్తిగా సంబంధం వున్నట్టులేదు. నిజానికతడు స్టేషన్ మాస్టరుకు లోబడి వుండవలసిన ఉద్యోగి. కానీ దావూద్ కాను స్టేషను మాస్టరుకు తానొక గార్డియనులా వ్యవహరిస్తున్నాడు. మిగిలిన పంపుడ్రయివర్లు గూడా అతడి ఆజ్ఞానువర్తులు. నూతనాగంతకుడికి తన రాజ్యవైభవాన్ని చూపించదలచిన రాజ్యాధీశుడిలా దావూద్ కాను నన్ను తీసుకెళ్ళి రైలుకట్టపైన నిల్చోబెట్టాడు. "చూడవోయ్ వెంకటరత్నం!" అన్నాడు. దేన్ని చూడమన్నావన్నాను. అదిగో, రోడ్డుకటు వైపున వున్నదే పాతపేట. అందులో, సగంమేరకు సాలెవాడ. పాతికభాగం కోమట్లయిండ్లు. మిగిలింది సాయిబుల గూడెం. చిల్లరకొట్టు, జవిళీ అంగళ్ళు కూరగాయల మార్కెట్టు, హోటళ్ళు, సెలూన్లు మొదలయినవన్నీ పాతపేటలోనే వున్నాయి. పోగా రోడ్డుకివతలవున్నది కొత్తపేట. ఇది రైలురోడ్డు పడిన తరువాత చాలా కాలానికి ఏర్పడింది. హైస్కూలు, సమితి ఆఫీసు, రూరల్ డిస్పెన్సరీ కొత్తపేటలోవున్నాయి. వీటిసిబ్బందికి విడివిడిగా క్వార్టర్స్ వున్నాయి. ఏ విధంగా చూచినా సిరిసంపదలతో తులతూగే ఊరు మల్లవరం. పాడిపంటలకుకొదువలేనివూరు. వ్యాపార సాపారాలు పుష్కలంగా సాగుతున్నాయి. ఎటొచ్చీ మల్లవరం పౌరులకున్న కొరత ఒక్కటే! త్రాగడానికిమంచి నీళ్ళులేవు, నాలుకపైన చిరచిరలాడే ఆ వుప్పునీళ్ళగొట్టం పెట్టిపోసినా గొంతుక వెంటదిగవు. తియ్యటి ఎడనీరులాంటిగంగాజలానికి కాణాచి ఒక రైల్వేబావిమాత్రమే! నువ్వు లక్షాధిపతివిగావచ్చు. గొప్ప భూస్వామివిగావచ్చు. వర్తక ప్రముఖుడివిగావచ్చు. ఉన్నతోద్యోగివిగావచ్చు. ఏమైనప్పటికీ నువ్వు మల్లవరంలో నివసించేవాడివైతే బిందెచేతబుచ్చుకుని రైల్వేవారి వాటరు టాంకుదగ్గరకు రాకతప్పదు. నిధిని కావలా కాసే యక్షుడిలా, యిక్కడ ఈ వాటరు



టాంకుకు కాపలాదారు దావూద్‌ఖాను. అతడు అనుగ్రహిస్తేనే పంపులో నీళ్లు. ఆగ్రహిస్తే బిందెలు ఖాళీ. మల్లవరంలో హైస్కూలుంది. సమితి కార్యాలయం వుంది ఆసుపత్రివుంది. కానీ అవివేకులయినా మల్లవరం పౌరులు బ్రతకగలరు. దావూద్ ఖానుతో మంచిగా వుండకపోతే అక్కడ జీవితయాత్ర దుస్తరం.

పరిచయమైన తర్వాత నన్ను పురప్రవేశం చేయించాడు దావూద్‌ఖాను. పురవిహారంలో నేనొక విడ్డూరాన్ని గమనించాను. దావూద్‌ఖాను ఒక హోటల్లోదూరి ఉపాహారం తెగతిన్నాడు. ఆపైన అయిదు నిమిషాలు కాకమునుపే ఒక టీస్టాల్లో ప్రవేశించి నాలుగైదు రొట్టెముక్కలు నంజుకున్నాడు. రెండుమూడు చోట్ల టీ నీళ్లు గుటగుట త్రాగేశాడు. ఒకచిల్లర కొట్టులోకివెళ్ళి పట్టెడు తమలపాకులు, గుప్పెడువక్కలు తెచ్చుకుని కరకర నమిలేశాడు. తిన్నదంతా అరగడానికని రెండుసోడాబుడ్లు ఒక్క

గుక్కలో పుచ్చుకున్నాడు. వస్తూ స్తూ ఒక బిందులోనుంచీ కట్టబీడీలు, ఒక అగ్గిపెట్టె గుంజుకున్నాడు. కంపెనీల దగ్గర జబర్దస్తీ పనికిరాదని చెప్పినవాడు దావూద్‌ఖానే! కానీ బజారులో డబ్బివ్వకుండా ఉచిత పరపతి సౌకర్యాలు పొందడంలో జబర్దస్తీ వున్నట్టు అతడు భావించడంలేదు!

దావూద్‌ఖాను వెంట తిరుగుతున్న గొద్దీ నాచుట్టూగూడా మసకమసకగా ఒక హోదా క్రమ్ముకుంటున్నట్టుతోచింది. నేను పంపు డ్రయివరునని, పైగా మిక్కిలి దావూద్‌ఖాను ఆశ్రితకోటికి చేరిన వాడిననీ తెలియగానే ఒకానొక హోటలు యజమాని నాకు గూడా అతిథిమర్యాదలు జరిపి సత్కరించాడు.

షెడ్డుకు తిరిగి వచ్చేసరికి గంట ఎనిమిదిన్నర. పైకప్పునుంచీ కరెంటు దీపం వ్రేలాడుతోంది. ఆ ఊరు తన రాజ్యమైతే దావూద్‌ఖానుకు ఆషెడ్డే కొలువుకూటం. అందులోని కుక్కిమంచమే సింహాసనం.

మంచంప్రక్కన పడుకని మేకపోతు ఒక్కటి మాత్రం దిక్కులు చూస్తోంది.

ఆ మేకపోతును గురించి ఒక ఉపాఖ్యానం చెప్పాడు దావూద్‌ఖాను.

"మూణ్ణెళ్లకొకసారి మామూళ్ళు ఉండడంవుంది లేవోయ్ వెంకట్రత్నం! క్రిందటి నెల వసూలైన డబ్బుతో మేకపోతు కొన్నాను. ఇంక నెలరోజులుంది దీనికి గడువు. పైనెల్లో మాకు పండగొస్తుంది. అదే దీనిపనిపట్టేరోజు. నాతోబాటుగా రైల్వేసొత్తుతినే పంపుడ్రయివర్లు అందరున్నారా! ఒక్కనాయాలైనా మామూళ్ళకని ఊళ్ళోకి వెళ్లడు. ఇల్లిల్లూ తిరిగేదినేను. వసూలు చేసిదింనేను, పోతును పట్టింది నేను. మేపేదీనేనే. కోస్తే వాటాలకు మాత్రం వచ్చేస్తారు. వస్తేవచ్చారులే! ఎల్లెక్కడెక్కడ పెట్టాలో నాకుతెలియదా! సగంవాటానాది. మిగిలిన సగంవాళ్ళది! ఏం వెంకట్రత్నం. బాగుండలా న్యాయం?"

కిముక్కు మనకుండా ఊరుకున్నాను. దావూద్‌ఖాను న్యాయం బాగుండడం లేదని చెబితే నాకు మల్లవరంలో మంచినీళ్ళు పుట్టవు!

"చూడ్డానికి మంచోడివిలావున్నావు. నీ సంగతి మరచిపోను. నీకూ ఒక వాటా యిస్తాలే, వండుకతిందువుగానీ...."

ఓరి పిడిల్లు బంగారంగానూ, ఈదావూద్ ఖానుగాడు యిప్పుడు మంచాడు నాకొంప! నేను శాకాహారిని. మాంసం ముట్టను. ఈ వాస్తవాన్ని సవినయంగా మనవి చేసుకున్నాను.

"మాంసంతినవా వెంకట్రత్నం.. ఇంకేం తింటావునువ్వు! ఆకులూ కాయలూ చెత్త చెదారమూతింటే నీకెక్కడినుంచి వస్తుందిబలం? పది మైసూరుపాకులు ఒక మూలగెముకముందు బలాదూరుకదుటయ్యా నువ్వు తినడానికి నేనేం చేస్తానుగానీ, నువ్వు షెడ్డులో పడివుంటావుగదా? ఈ పోతునుకాస్తా కనిపెట్టుకుని వుండు, మరేం లేదు. ఒక వాటెడు వేపాకుతెచ్చి పడేస్తె చాలు, దానిపాటుకది నముల్తూవుంటుంది. బద్దకించకుండా ఒకసారిప్లాట్‌ఫారంచుట్టుకొస్తె బుట్టెడు అరటి తొక్కలు గూడా దొరుకుతాయి. అడపాదడపా నీకు హోటల్లో అన్నం పెట్టిస్తానులే! ఊరికేగాదు...."

బికాసుబిడి జరరాగ్ని చల్లారడం సామాన్యమా! ఈ మహాకార్య నిర్వహణలో మల్లవరం పౌరులందరూ ఎవరి పాత్రవారు యథోచితంగా నిర్వహిస్తున్నారు. అందులో నాకూ కొంత పాలుపంచి యిచ్చేశాడు దావూద్‌ఖాను.

రోజులు గడచిపోసాగాయి. నాతోకలసి ఆరుగురు పంపుడ్రయివర్లున్నమాట నిజమేగానీ అందరూ కలసి పనిచేసేకాలం తక్కువ. టాంకులో నీళ్ళునింపిన తర్వాత మిగిలిన పంపుడ్రయివర్లు ఎవరిళ్ళకువాళ్ళు వెళ్ళిపోతారు. నేను వచ్చిన తర్వాత పంపు దగ్గర జనాన్ని సర్దుబాటుచేసే బాధ్యత నాకే అప్పగించేశాడు దావూద్‌ఖాను. దానికి తోడుగా మేకపోతుకు వేపాకు, అరటి తొక్కలు తెచ్చి పడేయవలసిన పని వుండనేవుంది!

ఉండివుండీ నాలుగైదురోజుల కొకసారి ప్రశ్నిస్తుండేవాడు దావూద్‌ఖాను."ఇక్కడ నీడ్యూటీ యింకా ఎన్నాళ్ళుంది వాయ్ వెంకట్రత్నం.." అని. పదిహేను రోజులన్నాను. పదిరోజులన్నాను. వారమన్నాను. ఎల్లుండికి వెళ్ళిపోవాలన్నాను. ఆఖరుకు రేపటిదినం తెల్లవారుజాము రైల్లో వెళ్ళిపోతున్నాననిగూడా అన్నాను.

మరునాటి ఉదయం నేను వెళ్ళిపోతాననగా ఆకాశానికి మూడేబారలన్నంత ఉల్లాసంగా వున్నాడు దావూద్‌ఖాను. అతగాడి పండుగకూడా మరునాడేనట!

"పండగకుండి వెళ్లగూడదా వెంకట్రత్నం?" అన్నాడు దావూద్‌ఖాను.

"ఎందుకులే! నువ్వు మాంసం తినవుగదా! వెళ్ళిపో" అంటూ పర్మిషన్ జారీచేశాడు.

నేను దిగులుగా మేకపోతు వైపు చూశాను, అది బిక్కుబిక్కుమంటూ నావైపే చూస్తోంది.

అదినాతోటి జీవం. ఎంచినట్టుగా ఒక నెలరోజులపాటు నేను దాని మేతసంగతి గమనించాను ఆ మాత్రానికే దాని కళ్లల్లో కృతజ్ఞత తాండవిస్తోంది, ఆ పచ్చిక మైదానం, అందులోని చెట్లు, వాటిలో ఆకు, దాన్ని తెచ్చి పడేయడానికి నేను, యిదంతా కలకాలం నిలిచివుండే భోగమేనని అదిభావిస్తున్నట్టుంది, తళతళ మెరిసేటట్టుగా దావూద్‌ఖాను మచ్చుకత్తి నూరిపెట్టివున్నాడని దానికి తెలియదు.

ఆ రోజురాత్రి నాకు నిద్రపట్టినట్టు జ్ఞాపకంలేదు. కళ్లు విప్పుకున్నప్పుడల్లా మేకపోతువైపే చూచాను. కళ్లు మూతబడినప్పుడు దాని తొడలు, కడుపు, తల, అలా విడివిడిగా దానిఅవయవాలన్నీ అంతర్నేత్రాల ఎదుట కదలాడినట్టుగా, ఉప్పుకారంతో కలసి చిరచిరలాడుతూ సత్తుపాత్రలో కళపెళ ఉడుకుతున్నట్టుగాతోచి, దిగ్గునలేచి కూర్చున్నాను,

అప్పటికి అర్ధరాత్రిగావచ్చింది. తెల్లవారుజామున నాలుగు గంటల రైలుకే నేను వెళ్లిపోవలసివుంది.

ఉన్నట్టుండి నా బుర్రలో మెరుపుమెరిసినట్టుగా ఒక ఆలోచన పుట్టింది.

రైల్వే డిపార్టుమెంటు దావూద్‌ఖాను వంచనకు గురిగాకుండా చూడడం నాచేతగాదు. దావూద్‌ఖాను దోపిడీనుంచీ మల్లవరం పౌరుల్ని తప్పించడం నా చేతగాదు. కానీ నేను నా చేతనైనంతలో ఈ పిచ్చి ప్రాణిని, మూగ జీవాన్ని రక్షించలేనా?

ఎందుకు రక్షింపలేను? రక్షింపగలను. రక్షిస్తాను....

ఎలా? ఎలా రక్షిస్తాను? అదే పాలు

పోవడంలేదు.

గంటసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను.

అమావాస్య దగ్గర్లో వుండేసరికి లోకమంతా చిమ్మ చీకటిలో నిద్రపోతోంది. కట్టువిప్పి మెల్లగా మేకపోతును లేవదీశాను. మేతకోసం తీసుకెళ్లే అలవాటును బట్టి అదినన్ను విశ్వాసంగా వెంబడించింది. కాలిబాటపైన ఊరినొక చుట్టు చుట్టుకుని కొత్తపేట క్రాసురోడ్డు దగ్గర మలుపుతిరిగి బొణాకరంవెళ్లే బాటపైన రెండో మైలు రాయి కనిపించేదాకా నడిచివెళ్లాను. అది చిట్టడవిలాంటి ప్రదేశం. మేకపోత కక్కడ ఎన్నాళ్ళుతిన్నా తరగని తిండి! చిట్టడవిలో దూరి అలాగే మరకొంతదూరంవెళ్తే నాగులేరు ఎదురౌతుంది. ఆఏటి కవతల, అవలా పొదరిళ్లే! నక్షత్రాల వెలుతురులో పొదలమధ్య నేనొక వందగజాలదూరం మాత్రం నడవగలిగాను. అక్కడ మేకపోతు మెడకు కట్టిన పగ్గాన్ని ఊడదీసి ఒక ముళ్ళచెట్టుపైకి విసిరాను. మెల్లగా వెన్నుపైన చరచి, చెట్లకల్లుకున్న ఆకుపతీగల వైపు చూడమని పైగచేసి వెనుదిరిగి మెల్ల మెల్లగా రోడ్డుపైకి వచ్చేశాను. అక్కడొక చెట్టుచాటున ఆగి పొదలవైపు చూచాను. మేకపోతు నన్ను వెంబడించడంలేదు. మరుక్షణంలో నేను కాలికొద్దీ పరుగెడుతున్నాను.

● ● ●

మల్లవరం నుంచి తిరిగి వచ్చినకొత్తలో నువ్వుచేసిన మంచిపనుల్లో రెండింటిని పేర్కొనవమని ఎవరైనా అడిగితే— ఒకటి: ఒకనోరులేని ప్రాణిని రక్షించాను. రెండు: దావూద్‌ఖానుకు శృంగభంగం చేశాను అని చెప్పేవుండేవాణ్ణి. మల్లవరం పౌరుల్లోనూ, కోటి ఉద్యోగుల్లోను దావూద్‌ఖాను ప్రసక్తనని కంటగించుకోనివారులేరు. అలాగని అతడిపైన ప్రతిచర్య తీసుకున్న వాళ్ళులేరు. వీలైనంతలో, ప్రత్యక్షంగా గాకపోయినా పరోక్షంగా ఎంతో కొంత ప్రతికారం నెరపినవాణ్ణి నేనొక్కణ్ణే!

పదిహేను రోజుల తర్వాత మల్లవరం స్టేషను మాష్టరుగారి వద్దనుంచి నాకొక ఉత్తరం వచ్చింది. నాకు రావలసిన నెల జీతం బట్వాడా అయిందనీ, స్టేషనులో హాజరై పుచ్చుకోవలసిందనీ ఆయన వ్రాశాడు.

దావూద్‌ఖాను కంట పడకుండా గుట్టు చప్పుడుగా తిరిగిరావాలన్నది నా నిర్ణయం. ఎంతో జాగ్రత్త తీసుకున్నాను. లాభంలేక పోయింది. ఒక ఫర్లాంగు దూరం నుంచీ దావూద్‌ఖాను నన్ను పోల్చుకున్నాడు. "ఉండవోయ్ వెంకట్రత్నం!" అన్నట్టుగా చేతులు ఊపాడు. అతను సమీపిస్తున్న కొద్దీ నాగుండె వేగంగా కొట్టుకోసాగింది. తీరా అతడు దగ్గరికివచ్చి భుజంపైన చేయివేసేసరికి నేను బిర్రబిగుసుక పోయాను.

"భలే వాడివే! హెప్పుడు భాయి రావడం. నాక్కనిపించకుండా ఎళ్ళిపోదామనే! అవని నీ చేత నయ్యేదేనా వెంకట్రత్నం! మల్లవరంలో పిట్టవాలితే, మన వల్లో పడాల్సిందే! రెండు పెసరట్లయినా తిని పెద్దువుగానీ, ఊళ్ళోకి పెళ్దాం పద...."

మనుషులకు దూరంగా తీసుకెళ్ళి యితడేమైనా దురాగతానికి పూనుకుంటాడేమో నన్న అనుమానం నాకు లేకపోలేదు.

కానీ దావూద్‌ఖానులో కించిత్తు మార్పయినా కానరావడం లేదు. అతడు నన్ను హోటలుకు తీసుకెళ్లాడు. పెసరట్లు పెట్టించాడు. కాఫీ యిప్పించాడు. మళ్ళీ ఎప్పుడైనా ఆటువైపు వస్తే తప్పకుండా తనను కలుసుకోమన్నాడు.

దావూద్‌ఖానుతో రెండు గంటల సేపు గడపిన తర్వాత లేని తెగువ తెచ్చుకుని ప్రశ్నించాను— "ఆ రోజు వుదయం నీకు చెప్పకుండా వెళ్ళిపోవలసి వచ్చింది. పండుగ బాగా జరిగిందా దావూద్‌ఖాన్?"

"ఎందుకు జరగదు భాయ్! బహుత్ ఖుషీగా జరిగింది. మూడునెలల పొడుగునా తెగమేసిన మేకపోతు గదా!! అడవి లేడి మాంసమే ననుకో! అందునా ఒక గమ్మత్తు జరిగిందిలే వెంకట్రత్నం! ఆరోజు తెల్లవారుజామున్నే నువ్వు వెళ్ళిపోయావా, నేను భళ్ళున తెల్లారేదాకా పెడ్డువైపు తిరిగి చూడకపోయానా, ఎవడో కుర్రవెధవ పోతును కూసానికి కట్టిన పగ్గం కాస్తా విప్పుకపోయాడు. పోతుమాత్రం అక్కడే పడుకుని వుంది. అదేం విడ్డూరమోగానీ దాని కడుపు కుక్కిత్తట్లా వుబ్బిపోయి వుంది. ఉన్నట్టుండి దానికేదైనా రోగం వచ్చిపడిందేమోననుకున్నాను. అదేంలేదు. తిన్న వాళ్ళందరూ నాలుగు రోజులదాకా దానిరుచి గురించి మాట్లాడమేననుకో...."

దావూద్ ఖానుకు ముఖంకనిపించకుండా అవతలికి తిప్పుకున్నాను. నా ముఖాన కత్తివేటుకు నెత్తురు చుక్కలేకుండా వుండడం అతడు గమనిస్తే నాకే అపాయం!

●□●